


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 353 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | ఆదివారం 23 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :353 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SUN 23 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## డీఎస్సీపై చర్చకు రా.. టైమ్, డేట్ నీ ఇష్టం!

### జగన్‌కు నారా లోకేశ్ ఐదోసారి సవాల్

- విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం
- డీఎస్సీపై చర్చకు రావాలంటూ జగన్‌కు ఐదోసారి సవాల్ విసిరిన లోకేశ్
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని హామీ
- కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తానని భరోసా
- వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేవారికి నో ఎంట్రీ అని స్పష్టం చేసిన లోకేశ్
- త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు

**పెన్ పవర్ డెస్క్:**డీఎస్సీ నియామకాలపై చర్చకు రావాలంటూ వైసీపీ అధినేత జగన్ కు తాను ఐదోసారి సవాల్ విసురుతున్నానని, దమ్ముంటే చర్చకు రావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. "టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చోవడం కాదు, బయటకు రా!" అని లోకేశ్ తీవ్ర స్వరంతో జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఎలా పనిచేశారని ఆయన ఎద్దేవా చేశారు. "ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని జగన్, ఇప్పుడు మేం పారదర్శకంగా భర్తీ చేసిన 16 వేల ఉద్యోగాలపై దుష్ప్రచారం చేస్తున్నారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అంటే కూడా ఆయనకు అవగాహన లేదు. అసెంబ్లీలో వారి ఆరోపణలకు సమాధానం చెప్పినా, బయటకు వచ్చి మళ్ళీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కష్టపడి టెట్, డీఎస్సీ రాసి ఎంపికైన ఉపాధ్యాయులను అవమానించడం మానుకోవాలి" అని లోకేశ్ హితవు పలికారు. జగన్ చెప్పే అబద్ధాలను కార్యకర్తలు బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**కార్యకర్తలే పార్టీకి బలం**

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, వారి

- మిగతా 2లో

## నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..!

- విద్యావ్యవస్థలోని సమస్యలను తెలుసుకునేందుకు మంత్రి లోకేశ్ వినూత్న ప్రయత్నం
- విద్యార్థులతో విద్యార్థిలా, ఉపాధ్యాయులతో ఉపాధ్యాయుడిలా మమేకం
- విశాఖలో ఆధునికీకరించిన పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులతో సరదాగా ముచ్చట
- విజయనగరంలో ఉపాధ్యాయులతో కలిసి కెమిస్ట్రీ క్లాస్‌లో కూర్చున్న వైనం
- లోకేశ్ ఆచరణాత్మక శైలిపై విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి హర్షం

- మిగతా 2లో



## ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్ కు సర్టిఫికెట్లు తీసుకురాకపోతే అది ఎవరితప్పు?

- మెగా డీఎస్సీపై విమర్శలను తిప్పికొట్టిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో గ్రూప్ 1 పేపర్లు ప్లంబర్లతో దిద్దించారని ఆరోపణ
- రాజకీయ చెత్తను కూడా శుభ్రం చేయాలని ప్రజలకు పిలుపు
- గొడ్డలి పార్టీ పాలనలో నకిలీ మద్యంతో 30 వేల మంది చనిపోయారన్న సీఎం
- ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుస్తామని హామీ



**పెన్ పవర్ డెస్క్:**మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డీఎస్సీలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదని, జరగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియకు బురద జల్లే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 సర్వీస్ పరీక్షల మూల్యాంకనంలో భారీ అవకతవకలు జరిగాయని, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఇంట్లో పనిచేసేవారితో సమాధాన పత్రాలు దిద్దించిన వాస్తవాలు వెలుగు చూస్తుండటంతో, ఇప్పుడు డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలమండ కోడూరులో జరిగిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. "మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 300 పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ ఎదుర్కొని ఉద్యోగాలు ఇస్తుంటే, ఏడాది తర్వాత ఆరోపణలు చేస్తున్నారు. ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తేకపోతే అదెవరి తప్పు? క్రీడా కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచి ఉద్యోగాలిస్తే, ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారమే క్రీడాకారులకు

- మిగతా 2లో

### అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు..

- నెట్‌జీరో గ్రామమే లక్ష్యం.. అలవరం కోడూరులో సీఎం చంద్రబాబు పర్యటన
- పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- వంటగది వ్యర్థాలతో సేంద్రియ ఎరువు, మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారాలు
- సౌర విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్ వినియోగం ద్వారా గ్యాస్, కరెంట్ ఆదా
- ఆదర్శంగా నిలుస్తున్న నెట్‌జీరో విధానాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక





### ఏపీలో నిరుద్యోగులకు శుభవార్త 10,060 పోస్టులతో 'జాబ్ క్యాలెండర్ 2026' విడుదల

- విడుదలైన ఏపీ జాబ్ క్యాలెండర్
- 4 దశల్లో 10,060 ఉద్యోగాల భర్తీ
- సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వరుసగా నోటిఫికేషన్లు
- ఉన్నత విద్యాశాఖలో ఇప్పటికే 1,500 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భారీ శుభవార్త అం దించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన "జాబ్ క్యాలెండర్-2026"ను విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక

- మిగతా 2లో



## బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

- ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం
- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం
- యువతను లక్ష్యంగా చేసుకుని 'యువ సంవాద్' కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- యూపీ, పంజాబ్ ఎన్నికల సన్నద్ధతపై త్వరలో పార్టీ సమీక్ష
- 'వందేమాతరం'పై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ బీజేపీ తీర్మానం

- మిగతా 2లో

## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

### తెలంగాణకు ప్రయోజనం



- రూ.7,000 కోట్లతో ఎల్‌పీజీ పైప్‌లైన్ విస్తరణకు కేంద్రం ఆమోదం
- తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం
- దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం
- ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్
- తగ్గనున్న రవాణా ఖర్చులు, ప్రమాదాల ముప్పు

**పెన్ పవర్ డెస్క్:**దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ

- మిగతా 2లో

## యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 సీజన్ 2

### పోస్టర్ ఆవిష్కరించిన దిల్ రాజు.. ఫస్ట్ ప్రైజ్ రూ.3 లక్షలు!

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ సంస్కృతి, పండుగలు, చరిత్రను తమ కెమెరాతో ప్రపంచానికి చూపించాలనుకునే యువ ఫిల్మ్ మేకర్స్‌కు అదిరిపోయే అవకాశం . బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 - సీజన్ 2' నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. యువతలోని సృజనాత్మకతకు పదును

- మిగతా 2లో





## నన్ను, నా కుటుంబాన్ని టార్గెట్ చేశారు..

### మంత్రి కొండా సురేఖ లేఖ

- అవమానకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీకి విజ్ఞప్తి
- విచారణ జరుగుతున్న సమయంలో తనపై బహిరంగ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్య
- కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని మల్లు రవి సూచన
- సురేఖ వివరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసిన మల్లు రవి

- మిగతా 2లో

## రూ.150కోట్ల నగదు బదిలీ..

### మరో వివాదంలో బీసీఐ ఛైర్మన్



**పెన్ పవర్ డెస్క్:** నల్సార్ విశ్వవిద్యాలయానికి సంబం ధించి ఓ నిర్ణయంతో ఇటీవల వార్తల్లో నిలిచిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర మరో వివాదంలో చిక్కుకున్నారు. మిశ్ర ఆధ్వర్యంలో బీసీఐలో ఆర్థిక అవకతవకలు, అనుమానాస్పద

- మిగతా 2లో

## సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

- ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో వివాదం
- ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలో విడుదల చేయాలని డిమాండ్
- నిర్మాతల మండలి కీలక ప్రకటన, షూటింగ్‌లకు ఇబ్బంది లేదు

- మిగతా 2లో



## శంఖవరం కస్తూరి బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన

సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అదనపు సమన్వయకర్త వి.వి.వి.సత్యనారాయణ....



**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 22:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రమైన శంఖవరం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయ, జూనియర్ కళాశాలను, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అదనపు సమన్వయకర్త వి.వి.వి.సత్యనారాయణ ఆకస్మికంగా సందర్శించారు. నిర్మాణం లో ఉన్న ఫిజిక్స్,కెమిస్ట్రీ లాబ్ లు, పరిశీలించారు. అలాగే వసతి గృహం లో ఉన్న స్టాక్ ను పరిశీలించి వంట వాళ్ళకి సూచనలు , సలహాలు ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు ఇచ్చే సాయంత్రం స్నాక్స్ ను , పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి చెందారు.
ఆయన తో పాటు ఏ ఎల్ ఎస్ ఓ రాంబాబు మురళి సందర్శించడం జరిగింది.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం





- “ఒక నెల--ఒక గ్రామం--నాలుగు సందర్శనలు” కార్యక్రమంలో 60కి పైగా అర్జీలు
- ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 22:** గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా “ఒక నెల--ఒక గ్రామం--నాలుగు సందర్శనలు” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.శనివారం కాకినాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను నేరుగా ఆలకించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి, ఆ పరిధిలోని గ్రామాల్లో నాలుగు వారాల పాటు ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మూడో శుక్రవారం సెలవు దినం కావడంతో ప్రజల సౌకర్యార్థం కార్యక్రమాన్ని శనివారానికి మార్చి కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించినట్లు వివరించారు. ఒక్కరోజే రూరల్ ప్రాంతం నుంచి 60కి పైగా వినతులు అందాయని తెలిపారు.
రమణయ్యపేట, తిమ్మాపురం, వాకలపూడి పంచాయతీల పరిధిలో డ్రైనేజీ, రహదారుల సమస్యలపై అత్యధికంగా అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. సమస్యల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వపరంగా అవసరమైన నిధులను సమకూర్చి యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు.
రహదారులు, కాలువల పక్కన జరుగుతున్న ఆక్రమణల వల్ల ప్రజల రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. నిర్ణీత కాలపరిమితిలోగా ఆక్రమణలను తొలగించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**సచివాలయ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి**

గ్రామ, వార్డు సచివాలయాల సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఉదయం వేళల్లో కూడా ప్రజలకు సేవలందించేందుకు కనీసం ఇద్దరు సిబ్బంది కార్యాలయంలో ఉండేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి తనిఖీలు ఉన్నప్పటికీ మధ్యాహ్నం వేళల్లో సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తామని తెలిపారు.గత వారాల్లో నిర్వహించిన “ఒక నెల--ఒక గ్రామం--నాలుగు సందర్శనలు” కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కలెక్టర్ తెలిపారు. మొదటి వారంలో కరప మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 50 అర్జీలు, రెండో వారంలో కూడా 50 చొప్పున వినతులు అందగా, మూడో వారంలో తాజాగా 60కి పైగా గ్రీవెన్సులు స్వీకరించినట్లు వివరించారు.వచ్చే వారం కూడా ఇదే నియోజకవర్గంలో కార్యక్రమాన్ని కొనసాగించి, ప్రజల ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకినాడ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి. వాసుదేవరావు, కాకినాడ రూరల్ ఎంపీడీవో పి. సతీష్, కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని ఇతర మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జనార్దన స్వామి వారి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 22:**శ్రావణ మాస రెండవ శనివారం, దశమి సందర్భంగా ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారి ఆలయానికి భక్త జనం పోటెత్తారు.నాలుగు శనివారాలు,నాలుగు ప్రదక్షిణల భక్తులతో పాటు, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఒక మహిళా భక్తురాలు అంగప్రదక్షిణలతో భక్తితో స్వామివారిని వేడుకోగా, మరొక మహిళా భక్తురాలు జోలె పట్టి స్వామి వారి పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. స్వామివారికి చేసిన విశేషాలంకరణ భక్తులందరినీ ఆకట్టుకుంది. ఆవునెయ్యి దీపాల మధ్య స్వామివారి దర్శనంతో భక్తులు పులకించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవానాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు ఏర్పాట్లను దగ్గరుండి మరీ పర్యవేక్షించారు.

# స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్రతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

- టిడ్కో గృహ సముదాయంలో ఘనంగా స్వచ్ఛత కార్యక్రమం
- రూ.10 లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 22:** రామచంద్రపురం పట్టణం 1వ వార్డు కొత్తూరులోని టిడ్కో గృహ సముదాయంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొని ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాల మెరుగుదలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.
టిడ్కో కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడబోమని వాసంశెట్టి సత్యం స్పష్టం చేశారు. కాలనీవాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**రూ.10 లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన**

అనంతరం టిడ్కో కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు వాసంశెట్టి సత్యం, ఇతర ముఖ్య అతిథులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. రహదారి నిర్మాణంతో కాలనీవాసుల రాకపోకలకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు.

**టిడ్కో కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు

మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు మాట్లాడుతూ టిడ్కో కాలనీల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్య సదుపాయాల మెరుగుదలకు నిరంతరం చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు కూడా పరిశుభ్రతను అలవర్చుకుని స్వచ్ఛమైన వాతావరణాన్ని కాపాడాలని కోరారు.





**స్వచ్ఛతే ఆరోగ్యానికి తొలి మెట్టు**

ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్

ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం**

జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్

జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు.ఇంటి నుంచి వీధి వరకు పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేయవచ్చని చెప్పారు. యువత స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మూడో విడతలో నిర్మాణంలో ఉన్న 960 టిడ్కో గృహాలను త్వరలో పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని నిర్మాణ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఈఈ గంగరాజు, డీఈ సురేంద్ర, సీఎల్టీసీ బిందు, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కొత్తూరు గ్రామ పెద్దలు, టిడ్కో కాలనీవాసులు, ప్రజలు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బూత్‌ల మార్పులతో ఓట్ల గందరగోళం.. అధికారులు స్పందించాలి



నోటీసులపై వైఎస్సార్‌సీపీ నేతల ప్రశ్నలు

**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు 22:**కొత్తపేట నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో అనేక తప్పిదాలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఓటర్ల జాబితాలో చోటుచేసుకుంటున్న మార్పులు, నోటీసుల జారీ తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
బిళ్లకూరు గ్రామంలోని 197వ బూత్‌లో మొత్తం 810 మంది ఓటర్లు ఉండగా, వారిలో 603 మందికి మాత్రమే నోటీసులు ఇవ్వడంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు. ఒకే బూత్‌లోని మొత్తం ఓటర్ల సంఖ్యకు, నోటీసులు అందుకున్న వారి సంఖ్యకు ఇంత వ్యత్యాసం ఎందుకు వచ్చిందో అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరుకు సముచిత అవకాశం కల్పించి, వివరాలను పారదర్శకంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని సుమారు 12 బూత్‌లలో ఒక బూత్‌కు చెందిన ఓటర్లను మరో బూత్‌లోకి పెద్ద సంఖ్యలో మార్చుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. సాధారణంగా 20, 30, 50 ఓట్ల మార్పులు జరిగినా సహజంగా భావించవచ్చని, అయితే 150, 170, 300 వరకు ఓట్లను ఒక బూత్ నుంచి మరో బూత్‌కు మార్చుతున్నట్లు కనిపించడం అనేక సందేహాలకు తావిస్తోందని అన్నారు. ముఖ్యంగా ఒక పార్టీకి మెజార్టీ వచ్చే బూత్‌లలో ఇలాంటి మార్పులు ఎందుకు జరుగుతున్నాయో అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు.దాదాపు 22 సంవత్సరాల తర్వాత చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. ఓటర్ల జాబితాలో ఒక్క తప్పిదం కూడా చోటుచేసుకోకుండా అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా, అనర్హుల పేర్లు కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు ఎలాంటి అనుమానాలు లేకుండా ఎన్నికల అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాలని, వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. కొత్తపేట నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం కలిగేలా పారదర్శకంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కల్పించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.

## ప్రజాదర్బార్ లో ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం


ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 22 :** ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని క్యాంప్ ఆఫీసులో శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు పెన్షన్లు, హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ముఖ్యంగా కాట్రావులపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు కాట్రావులపల్లి గ్రామ త్రాగునీటి అవసరాల కోసం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో భావారం నుండి వచ్చే ఫిల్టర్ నీరు కాట్రావులపల్లి గ్రామ హై స్కూల్ ఎదురుగా నీటి సంపు కట్టించి శుక్రవారం ట్రయల్ రన్ కూడా పూర్తి చేసామని ఈ సంపు వద్ద ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేసి 24 గంటల విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఆయన వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పిల్లా చంటిబాబు, రేఖ బుల్లి రాజు, సుంకవిల్లి రాజు, దాసరి సీతారామకృష్ణ, పురం శెట్టి శివాజీ, వేములకొండ జోగారావు, సత్తి సదాశివరెడ్డి, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.,

## చిన్నారుల విద్యలో అంగన్వాడీల పాత్ర కీలకం

జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 22:** ప్రారంభ బాల్య సంరక్షణ, విద్యలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ అన్నారు. జగ్గంపేట పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తల కోసం నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి రెండు, మూడు విడత శిక్షణ కార్యక్రమం మూడవ దశ ఆగస్టు 25 వరకు కొనసాగుతోంది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ సందర్శించి శిక్షణలో పాల్గొంటున్న అంగన్వాడీ కార్యకర్తలతో ముఖాముఖిగా మాట్లాడారు. శిక్షణలో అందిస్తున్న అంశాలు, బోధనా పద్ధతులు, కార్యకర్తల అవగాహన తదితర అంశాలను పరిశీలించారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని అంగన్వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేసి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జ్ఞాన జ్యోతి శిక్షణ ద్వారా అంగన్వాడీ కార్యకర్తల్లో నైపుణ్యాలను పెంపొందించి చిన్నారులకు నాణ్యమైన పూర్వ పాఠశాల విద్య అందించడమే ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పూర్ణిమ, మండల విద్యాశాఖాధికారులు స్వామి, సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు పాండు రంగారావు, పర్యవేక్షకురాలు అమ్మాజీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 22:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బొర్రా రాంసాగర్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టా సాధించారు. అస్సాంలోని ఎన్‌ఐటీ సిల్చార్ నుంచి ఆయన డాక్టరేట్ పొందినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో–ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు.
ఎన్‌ఐటీ సిల్చార్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం.ఎల్.వి. ప్రసాద్ పర్యవేక్షణలో రాంసాగర్ తన పరిశోధనను పూర్తి చేశారు. “బిహేవియరల్ స్టడీ ఆన్ ఎఫ్ఆర్‌సీ బేస్డ్ లేయర్డ్ అండ్ ఫంక్షనల్లీ గ్రేడెడ్ కాంక్రీట్” అనే అంశంపై ఆయన సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ లభించింది.



ఈ సందర్భంగా ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి రాంసాగర్‌ను అభినందిస్తూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డిప్యూటీ ప్రో–ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొ. ఎం.బి. శ్రీనివాస్, ప్రో–వైస్ ఛాన్సలర్ డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, విభాగాధిపతి డా. బి. రామ్మోహన్‌రెడ్డి తదితరులు రాంసాగర్‌కు అభినందనలు తెలిపారు.

### జగ్గంపేటలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు




**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 22:** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శనివారం జగ్గంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుదిరెడ్డి శ్రీనివాస్, ఫ్యాన్స్ ప్రెసిడెంట్ గెద్దా బాబురావు ఆధ్వర్యంలో జగ్గంపేట శ్రీ నాగేశ్వర థియేటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సినీ రంగంలోనే కాకుండా పలు సేవా కార్యక్రమాల్లో కూడా మెగాస్టార్ చిరంజీవి తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయ ఫిలిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ బూర్లు సాయి, కొండ్రోతు బుజ్జి, నరేష్, మండపాక శ్రీరామ్, మొగలి గంగాధర్, కృష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లూరు లిఫ్ట్‌కు జోరందుకున్న పనులు!





- సెప్టెంబర్ చివరికల్లా 31 వేల ఎకరాలకు సాగునీరు
- నాలుగోసారి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి, పెన్ పవర్ ఆగస్టు 22:** తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.52 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే గండేపల్లి మండల పరిధిలోని సుమారు 31 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. పనుల పురోగతిని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శనివారం నాలుగోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**రైతుల కోసం నిధులు తెచ్చాం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాళ్లూరు లిఫ్ట్‌కు శంకుస్థాపన చేసి నిధులు మంజూరు చేశారని తెలిపారు. గత ఏడేళ్లుగా సిమెంట్ పైపులు దెబ్బతినడంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.52 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు పునఃప్రారంభించామని చెప్పారు.

**వర్షం ఆటంకం.. నాణ్యతలో రాజీ లేదు**

ఎడతెరిపిలేని వర్షాలతో పనులకు కొంత ఆటంకం ఏర్పడుతోందని, ఒక్కరోజు వర్షం పడితే నాలుగు రోజుల వరకు పనులు నిలిచిపోతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. అయినప్పటికీ పనుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. జిందాల్ కంపెనీకి చెందిన ఐరన్ పైపులకు మెష్ ఏర్పాటు చేసి, హైప్రెజర్ సిమెంట్ కోటింగ్‌తో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

**రాజకీయాలు కాదు.. రైతుల ప్రయోజనమే లక్ష్యం**

లిఫ్ట్ పనుల పరిశీలన పేరుతో కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. గతంలో లిఫ్ట్ పనిచేయని సమయంలో రైతుల సమస్యల పరిష్కారానికి వారు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తాను రైతు పక్షపాతిగా పనిచేస్తున్నానని, ఈ ప్రాంతానికి సాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**నాలుగు సాగునీటి ప్రాజెక్టులు తీసుకొచ్చాం**

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జగ్గంపేట నియోజకవర్గానికి నాలుగు ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకొచ్చామని, తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఆ ప్రాజెక్టులను సాధించానని నెహ్రూ తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న వారు కనీసం ఒక్క సాగునీటి ప్రాజెక్టునైనా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు.

**మామిడాడ పథకంపై స్పష్టత**

తాళ్లూరు లిఫ్ట్ పనులు నిలిపివేసి మామిడాడ జ్యోతుల పాపారావు సాగునీటి పథకం పనులు చేపడుతున్నారంటూ కొందరు రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. మామిడాడ పథకాన్ని రూ.3.82 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేసి, నాలుగు గ్రామాల్లో 3,500 ఎకరాలకు సాగునీరు అందించేలా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పథకంతో పాటు నాలుగు సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని, తన భూములకు తానే సొంతంగా బోర్లు వేయించుకుని సాగు చేసుకుంటున్నానని స్పష్టం చేశారు.



**సెప్టెంబర్ చివరికల్లా సాగు నీరు**

వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే, వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో సెప్టెంబర్ నెలాఖరుకు తాళ్లూరు లిఫ్ట్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పైడిపాల సూరిబాబు, పిల్లా చంటిబాబు, రేఖ బుల్లిరాజు, జాస్తి వసంత్, ఉప్పలపాటి బుల్లెబ్బాయ్, దాసరి సీతారామకృష్ణ, పురంశెట్టి శివాజీ, సుంకవిల్లి రాజు, యర్రంశెట్టి బాబ్జి, కురుకూరి వీర వెంకట చౌదరి, శిలామంతుల వీరబాబు, పి.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతరిక్ష దినోత్సవం పై అవగాహన కార్యక్రమం.






**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 22:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతరిక్ష దినోత్సవం పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సునీత అధ్యక్షతన అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించబడిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానం, శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల ప్రాధాన్యత, భారతదేశ అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలు, భవిష్యత్‌లో యువతకు అందుబాటులో ఉన్న అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ, అధ్యాపకులు డా. శివ ప్రసాద్, వీరభద్ర రావు, డా. బంగార్రాజు, రాజేష్ , సతీశ్, మేరీ రోజలీనా, పుష్పా, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారుల సమగ్ర అభివృద్ధికి శిక్షణ ఎంతో కీలకం : ఎంఈఓ కె.హెచ్. నాయక్



**గండేపల్లి, పెన్ పవర్ ఆగస్టు 22:** గండేపల్లి మండలం మల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల కోసం నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి రెండో, మూడో సంవత్సరాల శిక్షణ కార్యక్రమం మూడో దశ కొనసాగుతోంది. ఈ దశలో ఆగస్టు 22న శిక్షణ నిర్వహించగా, తిరిగి ఆగస్టు 24, 25 తేదీల్లో కూడా శిక్షణ కొనసాగనుంది.
ఈ శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి కె.హెచ్. నాయక్ సందర్శించి పరిశీలించారు. శిక్షణలో బోధిస్తున్న అంశాలు, అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, అంగన్‌వాడీ కార్యకర్తల అవగాహన తదితర అంశాలను ఆయన పరిశీలించారు. శిక్షణలో భాగంగా 34 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన శిక్షణ సామగ్రిని పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎంఈఓ కె.హెచ్. నాయక్ మాట్లాడుతూ ప్రారంభ బాల్య సంరక్షణ, విద్యలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమన్నారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేసి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. చిన్నారులకు నాణ్యమైన ప్రీ–స్కూల్ విద్య అందించేందుకు కార్యకర్తలు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు.
జ్ఞానజ్యోతి శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధనా నైపుణ్యాలను పెంపొందించి, చిన్నారుల ప్రారంభ విద్యను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, శిక్షణ బృందం సభ్యులు, పర్యవేక్షకురాలు కరీమున్నిషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల విద్యాశాఖ అధికారి––2, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 22:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అధ్యపకులు వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక రంగాల్లో సాధించిన విజయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, శాస్త్ర విజ్ఞానం మరియు అంతరిక్ష పరిశోధనలపై యువతలో ఆసక్తిని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకుని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి ఫిజిక్స్ అధ్యపకులు వెంకటేశ్వరరావు అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం సాధించిన అద్భుతమైన పురోగతిని వివరించారు. ఇస్రో విజయాలు, చంద్రాయన్–3 విజయం గురించి తెలుపుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, పరిశోధనా ఆసక్తిని పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి. హెచ్. బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 22:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రావణ శుద్ధ లో దశమి సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, వైదిక క్రతువులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్రోత్సవాల తొలి రోజు కావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఉదయం 9.35 గంటలకు పవిత్రోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత సంకల్పము, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము నిర్వహించారు. అనంతరం ఋత్విక్ వరణము, దీక్షాధారణ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమ సంప్రదాయాలను అనుసరించి పూజా క్రతువులు కొనసాగాయి. స్వామి వారి పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ధర్మకర్త మండల సభ్యులు, ఆలయ ఉపక్రమిస్తారు నల్ల సూర్య చక్రధర్ రావు , పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పవిత్రత, వైదిక కర్మకాండల నిర్విఘ్న నిర్వహణను ఆకాంక్షిస్తూ ఆకల్మష హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమ కార్యక్రమాల అనంతరం స్వామివారికి నీరాజనము సమర్పించారు. మంత్రపుష్పములు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు ఆలయ సిబ్బంది, నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో

ఆలయ ప్రాంగణంలో సందడి

నెలకొంది. సాయంత్రం ప్రత్యేక వైదిక కార్యక్రమాలుపవిత్రోత్సవాల తొలి రోజు కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయంత్రం 5.15 గంటలకు మరిన్ని వైదిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం కార్యక్రమాల్లో సంకల్పము, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము నిర్వహించనున్నారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టనున్నారు.


పవిత్రోత్సవాల్లో అంకురార్పణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కార్యక్రమం విజయవంతంగా, నిర్విఘ్నంగా సాగాలని ఆకాంక్షిస్తూ వేద మంత్రోచ్చారణల మధ్య ఈ క్రతువును నిర్వహించనున్నారు. అనంతరం వాస్తుపూజ, అగ్నిమథనము, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

వాస్తుపూజ అనంతరం వాస్తుహోమాన్ని నిర్వహించి ఆలయ పరిసరాల్లో శాంతి, పావిత్ర్యాన్ని కాంక్షిస్తూ వైదిక క్రతువులు చేపట్టనున్నారు. అనంతరం నవమూర్తి ఆవాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. అర్చకులు, వేద పండితులు ప్రత్యేక మంత్రోచ్చారణలతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.వైదిక సంప్రదాయాలకు అనుగుణంగా ఏర్పాట్లుపవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని ఆగమ, వైదిక సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారు. స్వామివారి నిత్య కైంకర్యాలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శనం, తీర్థప్రసాద వితరణ తదితర ఏర్పాట్లు చేపట్టారు. సాయంత్రం వైదిక కార్యక్రమాలు పూర్తయిన అనంతరం నీరాజనము, మంత్రపుష్పములు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టి పవిత్రోత్సవాల తొలి రోజు కార్యక్రమాలను ముగించనున్నారు.

భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్న భక్తులు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కోనసీమతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. పవిత్రోత్సవాల సందర్భంగా స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. శ్రావణమాసంలో పవిత్రోత్సవాలు నిర్వహించడంతో ఆలయంలో మరింత ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పవిత్రోత్సవాల ద్వారా ఆలయంలో సంవత్సర కాలంలో జరిగే కైంకర్యాల్లో లోపాలు, దోషాలు ఏమైనా ఏర్పడితే వాటి పరిహారార్థం శాస్త్రోక్తంగా ప్రత్యేక క్రతువులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే అర్చకులు, వేద పండితులు నిర్ణీత క్రమంలో వివిధ పూజలు, హోమాలు, ఆవాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మొదటి రోజు కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ప్రారంభం కావడంతో రానున్న రోజుల్లో నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు భక్తుల్లో మరింత ఆసక్తి నెలకొంది. స్వామివారి అనుగ్రహం కోసం భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.




## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు





**కరప, పెన్ పవర్, ఆగస్టు 22** : మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయం వద్ద శనివారం సినీ నటుడు, మాజీ కేంద్ర మంత్రి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు, నాయకులు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రముఖ ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ బొండా సూర్యారావు కేక్ కట్ చేసి అభిమానులకు, నాయకులకు పంచారు. అనంతరం 30 మంది పంచాయతీ కార్మికులు, పేదలకు బియ్యం, కూరగాయలు, కిరాణా వస్తువులతో కూడిన నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కరప డీసీ ఛైర్మన్ పీజీ సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ ముద్రగడ రమేష్, పీఏసీఎస్ ఛైర్మన్లు ఎస్. భవానిశంకర్, దూడల నారాయుడు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, టిడిపి కాకినాడ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవు వెంకన్న, భోగిరెడ్డి కొండబాబు, లకమన సురేష్, సోమరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి:

# డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు




**కరప, పెన్ పవర్, ఆగస్టు 22 :** గ్రామాలు, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.వి. శ్రీనివాసరావు అన్నారు. 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం నడకుదురులో పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో కలిసి ఆయన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా, తడి-పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టి, రహదారులు, బస్టాప్‌లు, పాఠశాలలు, ఆసుపత్రుల ప్రాంగణాలను నిత్యం శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

?అనంతరం గ్రామస్థులతో 'స్వర్ణాంధ్ర' ప్రతిజ్ఞ చేయించారు. కరపలో పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ చేపట్టారు ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారి కర్రి శ్రీనివాసరావు, టిడిపి కాకినాడ పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రెటరీ దేవి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి కేవీ సూర్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వనుం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జొన్నాడ వద్ద అంగన్వాడీ టీచర్ల ఆటో బోల్తా



- తృటిలో తప్పిన పెను ప్రమాదం.
- తొమ్మిది మందికి స్వల్ప గాయాలు
- మండల హెడ్ క్వార్టర్ కి వెళ్ళాలంటే కేంద్రం 40--50 కి.మీ. వెళ్లాల్సిందే
- కొత్తపేట లేదా అయినవిల్లిలో కలపాలని గ్రామస్తుల డిమాండ్

**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 22:**కపిలేశ్వరపురం: స్వయంకృషి మండలంలోని అద్దంకివారిలంక గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్లు శనివారం ఉదయం ప్రయాణిస్తున్న ఆటో జొన్నాడ బ్రిడ్జి సమీపంలో ప్రమాదానికి గురైంది. అద్దంకివారిలంక నుంచి ఆలమూరు ప్రాంతంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ శిక్షణ కార్యక్రమానికి వెళ్తుండగా ఆటో అదుపుతప్పి ఎటుగట్టు కిందకు వెళ్లిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది అంగన్వాడీ సిబ్బంది ప్రమాదానికి గురయ్యారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. కొందరికి కాళ్లు, ఇతర శరీర భాగాల్లో స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కాళ్లకు గాయాలైన వారికి ఎక్స్‌రేలు తీయిస్తున్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సహచర సిబ్బంది, స్థానికులు స్పందించి వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

### ప్రమాదంతో మరోసారి తెరపైకి రవాణా, పరిపాలనా సమస్య

ఈ ప్రమాద ఘటనతో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న అద్దంకివారిలంక గ్రామానికి ఎదురవుతున్న రవాణా, పరిపాలనా సమస్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. గ్రామం నుంచి మండల కేంద్రం కపిలేశ్వరపురానికి వెళ్లాలంటే సుమారు 40 నుంచి 50 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామానికి సమీపంలో కొత్తపేట, అయినవిల్లి వంటి ప్రాంతాలు ఉన్నప్పటికీ పరిపాలనా పరిధి కారణంగా దూర ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలపై ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనులు, వైద్య సేవలు, విద్య, సంక్షేమ పథకాలకు సంబంధించిన అవసరాల కోసం మండల కేంద్రానికి వెళ్లాలంటే అధిక సమయం, ప్రయాణ ఖర్చు భరించాల్సి వస్తోందని అంటున్నారు.

### వరదల సమయంలో మరింత ఇబ్బందులు

గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావడంతో అద్దంకివారిలంకతో పాటు లంక గ్రామాలు తరచూ వరదలు, ముంపు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. వరదలు వచ్చిన సమయంలో ప్రజలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ సహాయక చర్యలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రత్యేక వ్యవస్థ ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు. అత్యవసర సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులను ఆశ్రయించాల్సి వచ్చినా దూరం కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. గ్రామ సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించడం లేదనే అసంతృప్తి కూడా ప్రజల్లో ఉందని పేర్కొంటున్నారు.

### వైద్య సేవలకూ దూరభారం

లంక ప్రాంతమైనప్పటికీ వ్యవసాయ ఉత్పత్తుల్లో ముందున్న అద్దంకివారిలంకలో వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో పాముకాటు, విషపురుగులు, ఇతర కీటకాల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు అంగర పీహెచ్‌సీ వంటి సమీప వైద్య కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని, మెరుగైన వైద్యం అవసరమైతే మరింత దూరం ప్రయాణించాల్సి వస్తుందని అంటున్నారు.

### పోలీసు, రెవెన్యూ సేవలకూ అవస్థలే

గ్రామంలో పోలీసు, రెవెన్యూ సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు కూడా దూర ప్రాంతాల్లోని కార్యాలయాలను ఆశ్రయించాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసు వ్యవహారాల్లో అంగర పోలీస్‌స్టేషన్, మండపేట సర్కిల్, రామచంద్రపురం డివిజన్ స్థాయి అధికారులను సంప్రదించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. జిల్లా స్థాయి పనుల కోసం మరింత దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కొత్తపేట లేదా అయినవిల్లిలో కలపాలి

అద్దంకివారిలంకకు ఉన్న భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని కొత్తపేట లేదా అయినవిల్లి మండలాల్లో అద్దంకివారిలంకను కలపాలని గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. రాబోయే పరిపాలనా పునర్విభజన, డీలిమిటేషన్ ప్రక్రియలోనైనా తమ గ్రామాన్ని సమీప మండల పరిధిలోకి తీసుకురావాలని కోరుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య, పోలీసు, రెవెన్యూ సేవలు ప్రజలకు చేరువవడంతో పాటు ప్రయాణ భారం కూడా తగ్గుతుందని చెబుతున్నారు. అంగన్వాడీ సిబ్బంది ఆటో ప్రమాదం వంటి ఘటనలు పునరావృతం కాకుండా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, గ్రామ ప్రజల దీర్ఘకాలిక పరిపాలనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అద్దంకివారిలంకను సమీపంలోని కొత్తపేట లేదా అయినవిల్లి మండలంలో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 95 మందికి ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ




**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 22:**ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ ఏజిపి బూసి విద్యా ప్రసన్న ఆధ్వర్యంలో గతంలో చింతలూరులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా వైద్యులచే కళ్ళజోళ్ళు సిఫార్సు చేయబడిన 95 మందికి శనివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం రోగులకు ఉచితంగా సేవలు అందించడం గర్వించదగ్గ అంశమని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గన్ని సూర్యలక్ష్మి, నారాయణరావు, చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీ అధినేత ద్విభాష్యం దీక్షితులు, వాడపల్లి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు సలాది నాగేశ్వరరావు, ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, కాకినాడ సత్యం స్టడీ సర్కిల్ అధినేత బూసి విద్యాసాగర్, గన్ని వెంకట్రావు, చింతలూరు నూకాంబిక ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వీరి అప్పారావు గౌడ్,వైట్ల శేషబాబు,రాంబాబు, బలుసు శ్రీనివాస్, ముప్పిరి వెర్రియ్య, షేక్ అన్సారి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి రెండేళ్ల పాలనలో అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు



**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 22**: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని పేర్కొన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి నాయకత్వంలో రూరల్ మండలం గంగనాపల్లి గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ బద్రి జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమ ధ్యేయం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధునిక ఆలోచనా విధానం రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేశాయని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతుల కల్పన వంటి కీలక రంగాల్లో ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శక పాలన సాగిస్తోందని నాయకులు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రూరల్ ప్రాంతాల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పించి, స్థానిక ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

### టీడీపీలోకి సుమారు 100 మంది చేరిక

కాగా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి సమక్షంలో ముమ్మిడి కృష్ణతో పాటు సుమారు 100 మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కూటమి నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిల్లి కృష్ణ ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జిలు కర్రి వెంకట్రాజు, మిరపల సూర్య ప్రకాష్, గ్రామ కమిటీ అధ్యక్షులు బండారు త్రివేణు, కూటమి నాయకులు రామదేవు సీతయ్య దొర, కొండా వినాయక్, మద్దు శ్రీను, పంపన నాగేశ్వరరావు, మేడిశెట్టి శేషగిరి, నిమ్మకాయల భద్రరావు, పాలిక ఉషారాణి ప్రకాష్, కొమిరిశెట్టి నరసింగరావు, ఎలగా లోవరాజు, గుత్తుల రమేష్, టేకుమూడి శ్రీను, కాళ్ల శ్రీను, పిల్లి రమణమ్మ, ఐరెడ్డి తాతీలు, ఎం. రామారావు, బి.నాగరాజు, దొమ్మేటి వెంకటరమణ, సరిదే నాగ హరినాథ్, పెంకే వీరబాబు, కోనాల కృష్ణ, కాదా ప్రసాదరావు, చల్లపల్లి గణపతి, చల్మాజి, మాసమేను శ్రీరాములు, చెల్లుబోయిన ప్రకాష్ రావు, రాయుడు శ్రీను, బాబా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే సత్యప్రభ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 22:** ఏలేశ్వరం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని ప్రతిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరం మున్సిపాలిటీలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పలు అభివృద్ధి పనులకు టెంకాయ కొట్టి శనివారం ప్రారంభించారు. టిడిపి టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ బొదిరెడ్డి గోపాలకృష్ణ, అలమడ చలమయ్య, మూది నారాయణస్వామి, కూటమి నేతల సమక్షంలో1.45 కోట్ల రూపాయలు వ్యయం తో నిర్మించి తలపెట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో 1,2,18,20 వ వార్డులలో సి సి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులకు ఆయా వార్డుల నాయకుల సమక్షంలో కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపనలు చేపట్టారు,

రాష్ట్రంలో కూటమి పార్టీ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. పట్టణాలు అభివృదే కూటమి పార్టీ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఏ ఎన్ ప్రకాష్, డి ఈ ధర్మ తేజ, మామిడి లలిత,వాగు రాజేష్ , జొన్నాడ వీరబాబు, వైబొగుల సుబ్బారావు,రుచి రమేష్,ఎండగుడి నాగబాబు, రాయుడు చిన్న, పెంద్ర శ్రీను, కోణాల వెంకట రమణ, శశి వెంకటేష్, సామంతుల గోపి,కోట్ల కృష్ణ, కర్రోతు గాంధీ, పతివాడ అఖిలేష్, సిడగం బాలు, శశి స్వామి, బుగత శ్రీను, నీలి త్రిమూర్తులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామకృష్ణ కుకిడ్నీ డయాలసిస్ కొరకు సహకారం



**అంబాజీపేట పెన్ పవర్, ఆగస్టు 22:** మొసలపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొంతు రామకృష్ణ రెండు కిడ్నీలు కు డయాలసిస్ చేయించుకుంటున్నారు. బొంతు రామకృష్ణ తల్లిదండ్రులు తమ కుమారుడు రామకృష్ణకు కిడ్నీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ నిమిత్తం 14 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. బాధితుడు బొంతు రామకృష్ణ నిరుపేద. వైద్యం చేయించుకోలేని నిస్సహాయ స్థితిలో సతమతమవుతున్నారు. బాధితునికి ఇద్దరు చిన్న పిల్లలు కలరు. విషయం తెలుసుకున్న పి గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామానికి చెందిన లలితమ్మ సేవా సంస్థ అధ్యక్షురాలు యన్నపు లలిత శనివారం మొసలపల్లి గ్రామం కిడ్నీ బాధితుడు బొంతు రామకృష్ణ ఇంటిని సందర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా యన్నపు లలిత బాధితుని కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంతులూరి శ్రీనివాసరాజు, మాజీ ఉపసర్పంచ్ కట్ట గోపాలకృష్ణ గోకలే, వైయస్సార్సీపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ముత్తాబత్తుల మణిరత్నం, ఎంపీటీసీ సభ్యుడు నూకపెయ్యి సత్యనారాయణ, వైసీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పి సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, వైసిపి బూత్ కమిటీ కన్వీనర్ దంతులూరి మురళి రాజు, మట్ట ఏడుకొండలు, ఎస్ జాన్ వెస్లీ, నాగ బత్తుల రాజేష్, సరెళ్ళ పవన్ కుమార్, మట్ట భవాని,మట్ట వెంకటేశ్వరరావు, సవరపు లక్ష్మి,బొంతు బుజ్జి, బొంతు నాగరాజు, సబ్బితి చినబాబు,గెద్దం బాబి,ముంగండ శ్రీనివాసరావు, యాండ్ర ఏసు తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి.

**-కిర్లంపూడి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో డీఈఓ, పి రమేష్.**



**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు 22:** ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్ అన్నారు.మండల కేంద్రమైన కిర్లంపూడి శ్రీ కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్ శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని సూచించారు.6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు చదవడం,రాయడం,మాట్లాడటం,గణితంలో చతుర్విధ ప్రక్రియలపై పూర్తి అవగాహన కల్పించేలా తగిన శిక్షణ అందించాలని సూచించారు.పాఠ్యాంశాల్లో తమకు తెలియని అంశాలు ఉంటే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల ద్వారా తోటి ఉపాధ్యాయుల నుంచి తెలుసుకుని,వాటిని విద్యార్థులకు సమర్థవంతంగా బోధించాలని కోరారు.తద్వారా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి రమణికుమారి అధికారులు టి జోసఫ్,ఎం చిన్నారావు,ప్రభుత్వ ఉన్నత తదితరులు పాల్గొన్నారు.

## తల్లి తర్వాత తల్లిలా చిన్నారులను తీర్చిదిద్దుతున్న అంగన్వాడీలు





**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు 22:**తల్లి తర్వాత తల్లిలా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను తీర్చిదిద్దుతూ, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తల సేవలు అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. శనివారం కొత్తపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన అంగన్వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో ప్రస్తుతం 30 మంది నూతన అంగన్వాడీలకు నియామక పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. మిగిలిన ఖాళీలను కూడా త్వరలో భర్తీ చేస్తామన్నారు. గ్రామాల్లోని ఉద్యోగాల్లో అంగన్వాడీ పోస్టులకు ప్రత్యేకమైన గౌరవం, విలువ ఉందన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారుల సంరక్షణ, విద్యాభివృద్ధిలో అంగన్వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

అంగన్వాడీలకు రాజకీయ, సామాజికంగా కూడా గుర్తింపు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంగన్వాడీల తరఫున పోరాడిన అనంతపురం జిల్లాకు చెందిన వడ్డెర మహిళ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి కల్పించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా 58,204 మంది అంగన్వాడీ సిబ్బందికి రూ.75 కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్‌ఫోన్లు అందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీల వేతనాలను రూ.8 వేల నుంచి రూ.11 వేలకు పెంచామని, రెండు విడతల్లో వేతనాలు పెంచినట్లు చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు జమ చేస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను మేజర్ అంగన్వాడీలుగా అప్‌గ్రేడ్ చేశామని, కొత్తపేట నియోజకవర్గంలో 24 మినీ అంగన్వాడీలను మేజర్ కేంద్రాలుగా మార్చామని తెలిపారు. గ్యాస్ సమస్యలకు పరిష్కారంగా ఇండక్షన్ స్టవ్‌లు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగన్వాడీ కార్యకర్తల పిల్లలకు సైతం 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రయోజనం కల్పించారని పేర్కొన్నారు. అంగన్వాడీ ఉద్యోగుల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదల, సేవల విస్తరణకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 22:**సినీపరిశ్రమలో కష్టపడి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి అని పలువురు కొనియాడారు. స్థానిక హైస్కూల్ ఎదురుగా చిరంజీవి అభిమానులు ఆయన జన్మదినవేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సినీ హీరో గా తనకంటూ ప్రత్యేక మైనటనతో ఎంతోమందిని అభిమానులు సంపాదించచికొని అందరి ఆదరణ సంపాదించుకున్న మెగాస్టార్ చిరంజీవి అని అన్నారు. మథర్ థెరీసాను ఆదర్శంగా తీసుకొని తనుకూడా పేదలకు సాయం చేతాలనే సంకల్పంతో బ్లడ్ బ్యాంకు, ఐ బ్యాంక్ స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవా దృక్పథం తో అభిమానులు తమ ప్రాంతాలలో ప్రజలకు సేవా చేయలనే పిలుపుతో ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహించిన చిరంజీ అభిమానులను పలువురు కొనియాడారు. ముందుగా మెగాస్టార్ అనే అక్షరాలతో తయారుచేసిన కేక్ కట్ చేసి అభిమానులకు అందచేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని మెగాస్టార్ చిరంజీ చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, మైపాల తాతాజీ, సుంకర బాలాజీ, కొర్లపాటి గోపి,రవణం రాము, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల బలరామమూర్తి, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, దొమ్మేటి వెంకట రామారావు, కొర్లపాటి ఢిల్లీ, పత్తి దత్తుడు, మేడిది శ్రీనివాసరావు, పేరాబత్తుల పెద సుబ్బారాజు, సూదాబత్తుల రమేష్, అరిగెల శివ కళ్యాణ్, సుంకర పేరయ్యనాయుడు, కొప్పినీడి ఈశ్వరరావు, మేడిది శ్రీ ను తదితరులు పాల్గొన్నారు

## శంఖవరం ఎస్సీ హాస్టల్ మూసివేతపై దళిత సంఘాల ఆగ్రహం....





**సోమవారం కలెక్టరేట్ ముట్టడి....**

**దళిత సంఘాలు అధికారులకు హెచ్చరిక....**

**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 22:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం లోని ఎస్సీ హాస్టల్ మూసివేతపై దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. హాస్టల్‌ను తక్షణమే పునఃప్రారంభించి దళిత విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అన్నవరం గ్రామంలో దళిత ఐక్య రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

సమావేశంలో దళిత నాయకులు మాట్లాడుతూ.. హాస్టల్ మూసివేతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాన్ని అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని మండిపడ్డారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి హాస్టల్‌ను ప్రారంభించక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దళిత నాయకులు తంతటి కిరణ్ కుమార్, సరమర్ల మధుబాబు మాట్లాడుతూ సోమవారం దళిత సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. ఈలోగా జిల్లా యంత్రాంగం స్పందించి హాస్టల్ ప్రారంభానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇది కేవలం హాస్టల్ సమస్య కాదని, దళిత విద్యార్థుల విద్యా హక్కుకు సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు అన్ని దళిత, విద్యార్థి సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ

సమావేశంలో తంతటి కిరణ్ కుమార్, సరమర్ల మధుబాబు, బత్తిన అప్పారావు, గంట భాస్కర్, రాయి శీను, ముఖే వీరబాబు, బోట్ల లావరాజు, తాతాజీ బత్తిన , జుత్తుక విజయ్, చింతాడ రమణ, బీర గాంధీ, కొంకిపూడి రాజ్యలక్ష్మి, ముఖే నాని బాబు, నూతన్ ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకుడు గంగ బాబు తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలి.లేదంటే ఉద్యమం తప్పదు అంటూ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించక పోతే రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను మరింత తీవ్రతరం చేస్తామని దళిత సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

# మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా



**చిరంజీవి అభిమానుల మధ్య కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు 22:** సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని, కోట్లాది మంది అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు కొత్తపేటలో శనివారం ఘనంగా జరిగాయి. చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి మెగాస్టార్ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరంజీవి కేవలం సినీ నటుడిగానే కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. తన నటన, క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారని అన్నారు. చిరంజీవి నటించిన చిత్రాలు తరతరాల ప్రేక్షకులను అలరిస్తూ, అభిమానుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయని పేర్కొన్నారు.

చిరంజీవి అభిమానుల్లో సేవా భావాన్ని పెంపొందించడంలో ఆయన చూపిన మార్గం ఎంతో స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే అన్నారు. రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయం, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా అభిమానులు తమ అభిమానాన్ని సేవా రూపంలో చాటుకోవడం అభినందనీయమన్నారు. చిరంజీవి స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి అండగా నిలవాలని అభిమానులకు సూచించారు.

చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు భారీ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు నిర్వహించారు. చిరంజీవి చిత్రాలు, బ్యానర్లతో ప్రాంగణాన్ని అలంకరించి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రూ.20 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 22:** రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు. పట్టణంలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.
రామచంద్రపురం పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ ఆడిటోరియం వద్ద రూ.10 లక్షల జనరల్ ఫండ్స్‌తో నిర్మించనున్న జీఐ షెడ్ నిర్మాణ పనులకు వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని 1వ వార్డు కొత్తూరులో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని వాసంశెట్టి సత్యం తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే మంత్రి వాసంశెట్టి సుభాష్ లక్ష్యమని ఆయన అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అత్యవసరమైన అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చేందుకు మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు.
కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గత రెండేళ్లలో రామచంద్రపురం పట్టణంలోనే సుమారు రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వాసంశెట్టి సత్యం తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల రంగాల్లో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి రామచంద్రపురం నియోజకవర్గాన్ని సుందరంగా, పరిశుభ్రంగా, ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు మంత్రి సుభాష్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధినే ప్రధాన అజెండాగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వాసంశెట్టి సత్యం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, వార్డు నాయకులు,కార్యకర్తలు, మున్సిపల్ ఏఈ సునీల్,సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# పరిశుభ్రతే కాకినాడ ప్రగతికి సోపానం





- ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర లక్ష్యం సాకారం
- రూ.1.57 కోట్లతో నూతన టిప్పర్లు, అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి
- స్వచ్ఛత కార్యక్రమంలో టిప్పర్ల ప్రారంభం.. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు, వస్త్రాల పంపిణీ

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 22:** ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర లక్ష్యం సాకారం అవుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ అన్నారు. పరిశుభ్రతే కాకినాడ ప్రగతికి సోపానమని, నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కాకినాడ నగరంలోని ఆనంద భారతి గ్రౌండ్‌లో కాకినాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఏర్పాటు చేసిన నూతన టిప్పర్లను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణకు అవసరమైన పనిముట్లు, వస్త్రాలను అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

**రూ.1.57 కోట్లతో ఆధునిక పరికరాలు**

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు నెలలో 'క్లీన్ సిటీస్, గ్రీన్ కమ్యూనిటీస్' అనే థీమ్‌తో కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ప్రజల్లో పరిశుభ్రతపై నూతన చైతన్యం తీసుకురావడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.
గతంలో స్థానిక ఎమ్మెల్యే పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు వారికి అవసరమైన ఆధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. కాకినాడ నగరంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, పారిశుద్ధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రూ.1.57 కోట్ల వ్యయంతో నూతన టిప్పర్లు, అధునాతన యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.
రానున్న రోజుల్లో పారిశుద్ధ్య వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు నూతన టిప్పర్లు, ఫాగింగ్ మెషిన్లు, స్ప్రేయర్లు వంటి అధునాతన పరికరాలను సమకూర్చుతున్నామని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేకంగా నిధులు కేటాయించి, ఆర్డర్లు కూడా ఇచ్చినట్లు చెప్పారు.
పారిశుధ్య కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఆధునిక రక్షణ పరికరాలు, యంత్రాలను సకాలంలో అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. కాకినాడ నగరాన్ని రాష్ట్రంలోనే సుందరమైన, పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



**పారిశుద్ధ్య వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు**

కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెత్త సేకరణ, పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయడం, దోమల నియంత్రణ, ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాకినాడ నగరంలో పారిశుద్ధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. నగరంలో చెత్త సేకరణను వేగవంతం చేసి, పరిశుభ్రత ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురావడంలో జిల్లా కలెక్టర్ చేస్తున్న ప్రత్యేక కృషిని ఎమ్మెల్యే అభినందించారు. నగరవాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని కాకినాడ నగర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ. సుధాకర్, ఈఈ కనకరాజు, ఎంహెచ్ఓ డా. పృథ్వీచరణ్, ఇతర నగర పాలక సంస్థ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ శిల్ప్ బజార్‌ను సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలి





**కాకినాడ ప్రజలు ప్రదర్శనను సందర్శించి విజయవంతం చేయాలి**

**శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 22:** చేతివృత్తిదారులు, హస్తకళాకారుల కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న గాంధీ శిల్ప్ బజార్ అభినందనీయమని శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ అన్నారు. కాకినాడ ప్రజలు కుటుంబ సమేతంగా ఈ ప్రదర్శనను సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కాకినాడ అర్బన్ హాట్, శిల్పారామంలో ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏడు రోజుల "గాంధీ శిల్ప్ బజార్ (జిల్లా స్థాయి)" ప్రదర్శనను శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ చేతివృత్తిదారులు, హస్తకళాకారుల నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది శిల్పారామంలో నిర్వహించే ఈ ప్రదర్శనలో ఈసారి వివిధ ప్రాంతాలకు చెందిన సరికొత్త, విభిన్న రకాల హస్తకళా ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని తెలిపారు.
ప్రదర్శనలో 40కి పైగా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారని, చీరలు, బొమ్మలు, కీచైన్లు తదితర అనేక హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కాకినాడ ప్రజలు కుటుంబ సమేతంగా ప్రదర్శనను సందర్శించి కళాకారుల ప్రతిభను ప్రత్యక్షంగా తిలకించి వారిని ప్రోత్సహించాలని కోరారు. ప్రత్యేకంగా పిల్లలను ఈ ప్రదర్శనకు తీసుకురావడం ద్వారా వారిలో కళలు, హస్తకళలపై ఆసక్తి పెంపొందించవచ్చని, తమ ఖాళీ సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకునేందుకు ఇది దోహదపడుతుందని ఎమ్మెల్సీ తెలిపారు. కాకినాడ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కళాకారులకు ప్రత్యక్ష మార్కెటింగ్ వేదిక
జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ దళారీల ప్రమేయం లేకుండా దేశవ్యాప్తంగా ఉన్న హస్తకళాకారులు, చేనేత కార్మికులు తమ కళాఖండాలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునేందుకు శిల్పారామం అద్భుతమైన మార్కెటింగ్ వేదికగా నిలుస్తోందన్నారు. గ్రామీణ కళలు, వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ జాతీయ సమగ్రతను పెంపొందించడం శిల్పారామం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గతంలో జిల్లాలో నిర్వహించిన శిల్ప్ బజార్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని గుర్తుచేశారు. ఆగస్టు 22 నుంచి 28 వరకు ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో మొత్తం 40 స్టాళ్లు---32 హస్తకళలు, 8 చేనేత స్టాళ్లు అందుబాటులో ఉన్నాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు. మన ప్రాచీన కళలు అంతరించిపోకుండా రాబోయే తరాలకు అందించేందుకు ప్రజలు గాంధీ శిల్ప్ బజార్‌ను సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏపీ శిల్పారామం సొసైటీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ తిరుమలలో న్యాయమూర్తి ఆధ్యాత్మిక దర్శనం

**వాడపల్లి వెంకన్న సన్నిధిలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా**





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 22:** గోదావరి గలగలలు.. పచ్చని కోనసీమ అందాలు.. ఆధ్యాత్మిక పరిమళాలతో అలరారే వాడపల్లి క్షేత్రంలో భక్తిభావం వెల్లివిరిసింది. కోనసీమ తిరుమలగా భక్తుల విశేష ఆదరణ పొందుతున్న వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా దర్శించుకున్నారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం కోనసీమలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఏడు శనివారాల స్వామిగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్న ఈ క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆలయానికి విచ్చేసిన జడ్జి జునైద్ అహ్మద్ మౌలానాకు ఆలయ అధికారులు, సిబ్బంది సంప్రదాయబద్ధమైన ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని, ఆలయ ఆధ్యాత్మిక వాతావరణంలో కొంతసేపు గడిపారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు జడ్జి మర్యాదపూర్వకంగా సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం స్వామివారి ప్రసాదాలను సమర్పించారు.
వాడపల్లి క్షేత్రానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాశస్త్యంతో పాటు, ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. బ్రహ్మోత్సవాల వంటి సందర్భాల్లో వేలాది మంది భక్తులు తరలివచ్చే ఈ క్షేత్రం భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా నిలుస్తోంది. జడ్జి ఆలయ దర్శనానికి వచ్చిన సందర్భంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## మందపల్లి మందేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల సందడి

**తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలతో భక్తిశ్రద్ధలు.. రూ.2.47 లక్షల ఆదాయం**



**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు 22:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో శనీశ్వర స్వామివారి అనుగ్రహం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. స్వామివారికి ముఖమండప తైలాభిషేకం, ఏకాదశ రుద్ర తైలాభిషేకం, మహాన్యాస పూర్వక తైలాభిషేకం వంటి ప్రత్యేక సేవలను భక్తులు నిర్వహించారు. తైలం సమర్పించి స్వామివారిని దర్శించుకోవడంతో పాటు తిలదానం, స్వయం జపం హోమం, కేశఖండన, మాస కళ్యాణం తదితర సేవల్లో భక్తులు పాల్గొన్నారు. మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి క్షేత్రంలో శనివారం తైలాభిషేకానికి విశేష ప్రాధాన్యత ఉంది. శనీశ్వరుని కటాక్షం కోసం భక్తులు తైలం సమర్పించి, స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తూ భక్తిపూర్వకంగా ప్రార్థనలు చేశారు. కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని, కష్టాలు తొలగిపోవాలని స్వామివారిని వేడుకున్నారు. పూజల అనంతరం భక్తులు ఆలయంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయానికి ప్రత్యక్ష పూజల ద్వారా రూ.1,27,190 ఆదాయం లభించగా, పరోక్ష (ఆన్‌లైన్) పూజల ద్వారా రూ.82,900, అన్నప్రసాదం విరాళాల ద్వారా రూ.37,745 ఆదాయం సమకూరింది. మొత్తంగా శనివారం రూ.2,47,835 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం ప్రత్యేక పూజల సందర్భంగా మందపల్లి క్షేత్రంలో భక్తి సందడి నెలకొంది.

# శ్రీలంకతో రెండో టెస్టుకు ముందు కుల్దీప్‌కు గంభీర్ కీలక సూచన!

- వికెట్ల కోసం తొందరపడొద్దని కుల్దీప్‌కు గంభీర్ సూచన
- మంచి స్పెల్‌పై దృష్టి పెట్టాలని సూచించిన గంభీర్
- 20 వికెట్లు తీయగల బౌలింగ్ దళమే లక్ష్యమని వివరణ
- పరిస్థితులకు తగ్గట్టే తుది జట్టును ఎంచుకుంటామని స్పష్టీకరణ
- కుల్దీప్‌ను అత్యంత ప్రమాదకర బౌలర్‌గా అభివర్ణన



**హైదరాబాద్ పెన్ పవర్:** వికెట్లు తీయాలనే ఆత్రుతతో బౌలింగ్ చేయకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని భారత హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు సూచించాడు. శ్రీలంకతో ఆదివారం ప్రారంభమయ్యే రెండో టెస్టు నేపథ్యంలో జట్టు కూర్పుపై చర్చ జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు చేశాడు.

గాలేలో జరిగిన తొలి టెస్టులో కుల్దీప్ ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడి స్థానం గురించి చర్చ జరుగుతోంది. జట్టులో సారాంశ్ జైన్ రూపంలో మరో స్పిన్ ఆల్‌రౌండర్ కూడా అందుబాటులో ఉన్నాడు.అయితే టెస్టు మ్యాచ్ గెలవాలంటే 20 వికెట్లు తీయగల అత్యుత్తమ బౌలింగ్ దళాన్ని ఎంపిక చేస్తామని గంభీర్ స్పష్టం చేశాడు. పరిస్థితులను బట్టి తుది జట్టును నిర్ణయిస్తామని చెప్పాడు.కుల్దీప్‌తో తన చర్చల గురించి మాట్లాడుతూ.. వికెట్ల కోసం అత్యాశ పడకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపాడు. రిస్ట్ స్పిన్నర్లు వికెట్ల కోసం ఆత్రుత పడితే బౌలింగ్‌పై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నాడు.కుల్దీప్ సామర్థ్యంపై తమకు పూర్తి నమ్మకం ఉందని గంభీర్ పేర్కొన్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అతడు ప్రమాదకర బౌలర్‌గా మారగలడని తెలిపాడు. అయితే పరిస్థితులకు అనుగుణంగా ఫలితం ఇచ్చే బౌలింగ్ దళానికే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశాడు.గాలే టెస్టు పిచ్‌పై కూడా గంభీర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. స్పిన్నర్లు, పేసర్లు, బ్యాటర్లకు ఆ పిచ్ సహకరించిందని అన్నాడు. ఐదు రోజుల పాటు తీవ్రంగా శ్రమిస్తేనే టెస్టు మ్యాచ్ గెలవగలమని చెప్పాడు.అలాగే ఐదుగురు ప్రధాన బౌలర్లతో ఆడటం జట్టుకు వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని పేర్కొన్నాడు. ఫ్లాట్ పిచ్‌లపై బౌలర్లను రొటేట్ చేసేందుకు ఇది అవకాశం ఇస్తుందని తెలిపాడు.

# 15 ఏళ్ల వైభవ్.. టెస్టుల్లోనూ అదరగొడతాడా? ద్రవిడ్ ఏమన్నాడంటే!

- వైభవ్ టెస్టు క్రికెట్‌కు కొత్త ఊపు తేగలడన్న ద్రవిడ్
- దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరపున ఆడనున్న వైభవ్
- రెడ్‌బాల్ క్రికెట్‌లో వైభవ్‌కు మరింత అనుభవం అవసరమన్న ద్రవిడ్
- వైభవ్ ఎదుగుదలపై ఓపిక అవసరమని ద్రవిడ్ సూచన
- సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ అనధికారిక టెస్టులు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. భవిష్యత్తులో టెస్టు క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకురాగలడని భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. అయితే 15 ఏళ్ల వైభవ్ ఎదుగుదలను జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించాడు. అతడికి తగినంత సమయం, అనుభవం ఇవ్వాలని చెప్పాడు.వైభవ్ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరపున ఆడనున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో ఇప్పటికే సత్తా చాటిన అతడికి.. రెడ్‌బాల్ క్రికెట్‌లో నిలకడ సాధించేందుకు ఇది కీలక అవకాశం. 2025 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున వైభవ్‌కు ద్రవిడ్ కోచ్‌గా వ్యవహరించాడు.వైభవ్ ఇప్పటివరకు ఎనిమిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అతడి సగటు 17.25గా ఉంది. దేశవాళీ రెడ్‌బాల్ క్రికెట్‌లో ఎక్కువకాలం వరుసగా ఆడే అవకాశం అతడికి ఇప్పటివరకు పెద్దగా దక్కలేదు. దులీప్ ట్రోఫీతో ఆ లోటు తీరే అవకాశం ఉంది. సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ రెండు అనధికారిక టెస్టులు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు కూడా వైభవ్‌కు ఉపయోగపడే అవకాశముంది.టీ20 క్రికెట్‌కు, టెస్టు క్రికెట్‌కు చాలా తేడా ఉంటుందని ద్రవిడ్ పేర్కొన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇన్నింగ్స్‌ను నిర్మించడం, ఒత్తిడిని తట్టుకోవడం, ఎక్కువసేపు ఏకాగ్రతతో బ్యాటింగ్ చేయడం వైభవ్ నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పాడు.వైభవ్ సూర్యవంశీకి ఇంకా 15 ఏళ్లేనని ద్రవిడ్ గుర్తు చేశాడు. అతడి కెరీర్‌లో విజయాలతో పాటు వైఫల్యాలు కూడా వస్తాయని పేర్కొన్నాడు. అందుకే అతడిపై ఓపికతో వ్యవహరించాలని సూచించాడు.టెస్టు క్రికెట్ మనుగడ సాగించాలన్నా, ఎదగాలన్నా మూడు ఫార్మాట్లలో ఆడగల ఆటగాళ్లు అవసరమని ద్రవిడ్ అన్నాడు. వైభవ్ భవిష్యత్తులో భారత్ తరపున టెస్టు ఆటగాడిగా ఎదిగితే ప్రపంచ క్రికెట్‌కే అది ఆసక్తికర పరిణామమవుతుందని పేర్కొన్నాడు.

# 'లైక్స్, వ్యూస్ కాదు.. ట్రోఫీలే ముఖ్యం'.. గంభీర్ కీలక వ్యాఖ్యలు

- టెస్టుల్లో భారత్ ఇబ్బందుల్లో లేదన్న గంభీర్
- ర్యాంకింగ్స్ కంటే ట్రోఫీలు గెలవడమే లక్ష్యమని స్పష్టీకరణ
- శ్రీలంకపై భారత్ 1-0తో సిరీస్‌లో ఆధిక్యం
- గిల్, పడిక్కల్, సుతార్‌పై గంభీర్ విశ్వాసం
- 20 వికెట్లు తీసే బౌలింగ్ కూర్పే కీలకమని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడొద్దని అన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టం చేశాడు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పాడు.శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుంది.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైంది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్‌ల్లో ఓటములు ఎదురయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ అన్నాడు."మేం టెస్టు క్రికెట్‌లో ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నాం. నా పని ట్రోఫీలు గెలవడం. నేను పట్టించుకునేది అదే" అని గంభీర్ స్పష్టం చేశాడు.కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తం చేశాడు. కొలంబోలో 20 వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నాడు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నాడు. క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజమని, ఆటగాళ్లకు మరింత సమయం ఇవ్వాలని సూచించాడు. గిల్, పడిక్కల్, సుతార్‌లపై గంభీర్ విశ్వాసం ప్రకటించాడు.

మూడు టెస్టుల సిరీస్‌లకు గంభీర్ మద్దతు తెలిపాడు. తొలి టెస్టులో ఓడిన జట్టుకు పుంజుకునే అవకాశం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో ప్రస్తుత సిరీస్ రెండు టెస్టులకే పరిమితం కావడంతో రెండో మ్యాచ్ ఫలితమే సిరీస్‌ను నిర్ణయించనుంది.






# జెట్ స్పీడ్‌లో ప్రజెట్ స్పీడ్‌లో ప్రభాస్ లైనప్ - హను రాఘవపూడితో మరో క్రేజీ ప్రాజెక్ట్!

ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్ట్‌లతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఒకవైపు గ్లోబల్ ప్రాజెక్ట్‌లు చేస్తూనే.. మరోవైపు యువ దర్శకులతో ప్రయోగాత్మక చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే పలు భారీ బడ్జెట్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రభాస్ షెడ్యూల్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరనుందనే వార్తలు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న -ఫౌజీ- షూటింగ్ చివరి దశకు చేరుకున్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి.ఈ సినిమా సెట్స్‌లో దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్, టేకింగ్ విధానం ప్రభాస్‌కు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కథలోని డెప్త్, ఎమోషనల్ కంటెంట్ ప్రభాస్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయట. ఈ నేపథ్యంలోనే హను రాఘవపూడి చెప్పిన మరో సరికొత్త కథకు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న -ఫౌజీ- అనుకున్న దానికంటే అద్భుతంగా రావడంతో? రిపీట్ కొలాబరేషన్‌కు తీస్తున్నట్లు సమాచారం.ఈ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థలలో ఒకటైన హోంబలే ఫిలిమ్స్ - మైత్రి మూవీ మేకర్స్ సంస్థల్లో ఏదో ఒకటి నిర్మించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే ఈ ప్రొడక్షన్ హౌస్‌లతో ప్రభాస్‌కు మంచి అనుబంధం ఉండటంతో త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందంటున్నారు. మరోవైపు ప్రభాస్ ఖాతాలో ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్న -కల్కి 2-, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -స్పిరిట్-.. అలాగే ప్రశాంత్ నీల్ తో -సలార్ 2- వంటి భారీ చిత్రాలు క్యూలో ఉన్నాయి.ఇలాంటి బిజీ షెడ్యూల్ మధ్యలోనూ మరో కొత్త సినిమాకు డార్లింగ్ డేట్స్ కేటాయించడం ప్రభాస్ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒకరి తర్వాత ఒకరుగా క్రేజీ ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్న రెబల్ స్టార్ వేగం చూస్తుంటే రాబోయే రెండు.. మూడేళ్లలో బాక్సాఫీస్ రికార్డులన్నీ డార్లింగ్ పేరిట ఖాయమనిపిస్తోంది. వరుస పాన్-ఇండియా చిత్రాలతో తెలుగు సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా నెక్స్ట్ లెవెల్‌కు తీసుకువెళ్తున్నారు. ప్రభాస్ తో పాటు బన్నీ కూడా అదే రేంజ్ లో కెరీర్ ని ప్లాన్ చేసుకుని ముందుకెళ్తున్నారు. ఇదే తరహాలో రామ్ చరణ్, ఎన్టీఆర్, మహేష్ కూడా భవిష్యత్ ప్రాజెక్ట్ లను ప్లాన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే వారంతా కూడా తదుపరి చిత్రాల విషయంలో ఓ నిర్ణయానికి వచ్చారు

భాస్ లైనప్ - హను రాఘవపూడితో మరో క్రేజీ ప్రాజెక్ట్!

ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్ట్‌లతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఒకవైపు గ్లోబల్ ప్రాజెక్ట్‌లు చేస్తూనే.. మరోవైపు యువ దర్శకులతో ప్రయోగాత్మక చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే పలు భారీ బడ్జెట్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రభాస్ షెడ్యూల్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరనుందనే వార్తలు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న -ఫౌజీ- షూటింగ్ చివరి దశకు చేరుకున్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా సెట్స్‌లో దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్, టేకింగ్ విధానం ప్రభాస్‌కు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కథలోని డెప్త్, ఎమోషనల్ కంటెంట్ ప్రభాస్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయట. ఈ నేపథ్యంలోనే హను రాఘవపూడి చెప్పిన మరో సరికొత్త కథకు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న -ఫౌజీ- అనుకున్న దానికంటే అద్భుతంగా రావడంతో? రిపీట్ కొలాబరేషన్‌కు తీస్తున్నట్లు సమాచారం.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com